వివాదాల ఎస్వీబీసీ

టీటీడీ అనుబంధ విభాగమైన ఎస్వీబీసీలో ఇష్టానుసారంగా సలహాదారులను నియమించారు. ధర్మారెడ్డి ఆధిపత్యం ఎస్వీబీసీలోనూ కొనసాగింది. ప్రవచనకారుడు చాగంటి కోటేశ్వరరావు సలహాదారు పదవిని సున్నితంగా తిరస్కరించారు కూడా.

'పాప ప్రక్షాళన'కు జగనొస్తున్నాడు.
ఎవరు చేసిన పాపం ఇది?
ఐదేళ్లు తిరుమలలో ఏం జరిగింది?
'మనోళ్ల' నిర్వాకం ఏమిటి?
భక్తీ, భయం, పాపభీతీ ఎలా మాయమయ్యాయి?
పర్సంటేజీల రాజకీయ అవినీతి టీటీడీలో ఎలా వేళ్లూనుకుంది?
సాధారణ భక్తులకు కిలోమీటర్ల క్యూలు.. వీవీఐపీలకు హారతి దర్శనాలు.. పేదలకు చలికి వణికే షెడ్లు.. పెద్దలకు స్టార్ హోటళ్లను తలదన్నే గెస్ట్‌హౌస్‌లు..
ఎవరు చేసిన పాపం ఇది జగనయ్యా?
బంధు, భక్త అనుచరగణం రెచ్చిపోయి తిరుమలను భ్రష్టు పట్టిస్తుంటే.. చేసిందేమిటి?
మౌనం.. అరాచకానికి ఆమోదం కాలేదా?
ఎలా ప్రక్షాళన అవుతుంది?
ఒక్కరోజు పూజతో చేసినవన్నీ చెరిగిపోతాయా?
గాయపడ్డ భక్త హృదయాలను అబద్ధాలతో మాయచేయగలరా?
ఐదేళ్లు.. మీ పాలనలో తిరుమల కేంద్రంగా జరిగిన తంతును భక్తకోటి తలచుకుని తల్లడిల్లుతోంది. మా విశ్వాసాలను మీ రాజకీయాలకు బలి చేయవద్దని చేతులు జోడించి వేడుకుంటోంది.

ఈ పాపం నీదేనయ్యా!

అంతా మనోళ్లే!

జగన్‌రెడ్డి పాలనలో మూడుసార్లు టీటీడీ పాలకమండళ్లను ఏర్పాటు చేశారు. జగన్‌రెడ్డికి సమీప బంధువులనే ఛైర్మన్‌లుగా నియమించారు. ఎన్ని విమర్శలు వచ్చినా ఛైర్మన్‌లూ, ఈవోలూ కూడా ఒకే సామాజికవర్గంవారినే నియమించారు. 2019లో ఛైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి, ఈవోగా జవహర్‌రెడ్డి వున్నారు. ఆ బోర్డులోని మొత్తం 37మందిలో ఈవోను మినహాయిస్తే ఛైర్మన్, ఒక ఎక్స్ అఫిషియో మెంబరు, నలుగురు మెంబర్లు, ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితులు కలసి ఎనిమిదిమంది రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారే ఉన్నారు. 2021లో రెండవ పాలకమండలి ఛైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి కొనసాగారు. ఈవోగా జవహర్‌రెడ్డి వున్నారు. ఈ బోర్డులోనూ ఏడుగురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారున్నారు. 2023లో ఏర్పడిన పాలకమండలిలో ఛైర్మన్‌గా భూమన కరుణాకర రెడ్డి, ఈవోగా ధర్మారెడ్డి వున్నారు. ఇందులోనూ ఏడుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారున్నారు. ఐఏఎస్ కాకపోయినా ధర్మారెడ్డి కోసం వైసీపీ ప్రభుత్వం ఏకంగా అదనపు ఈవో పోస్టునే సృష్టించింది. జవహర్‌రెడ్డి బదిలీ తర్వాత రెగ్యులర్ ఈవోను నియమించకుండా ధర్మారెడ్డినే ఇంఛార్జి ఈవోగా కొనసాగించింది. అర్హతలు లేకున్నా సందీప్‌రెడ్డి అనే వ్యక్తికి టీటీడీ ఐటీ విభాగంలో తొలుత సైబర్ ఎక్స్‌పర్ట్‌గా, తర్వాత ఏకంగా ఆ విభాగం జీఎంగా నియమించింది. అదే సామాజిక వర్గానికి చెందిన ఒక పోలీసు అధికారి సీఎంకు సన్నిహితుడనే పేరుతో తిరుమలలో జగన్ జమానాలో చక్రం తిప్పారు.





జగన్ సమర్పించిన జంబో బోర్డు

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో టీటీడీని ఆ పార్టీ నేతలు తమ సొంత సంస్థగా మార్చుకునే ప్రయత్నం చేశారు. టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 29 మందితో ఏర్పాటు కావాల్సిన పాలకమండలిని జంబో బోర్డుగా మార్చివేశారు. 2021 సెప్టెంబరులో 29మందిని సభ్యులుగా మరో 52 మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించి టీటీడీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చే ప్రయత్నం చేశారు. అయితే హైకోర్టు ఆదేశాలతో ప్రత్యేకాహ్వానితుల నియామకానికి బ్రేక్ పడింది.

అవినీతి మచ్చలున్నవారు పాలకమండలిలో

తీవ్ర అవినీతి ఆరోపణలున్న ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త కేతన్ దేశాయ్‌ని టీటీడీ పాలకమండలి సభ్యుడిగా జగన్ నియమించారు. ఈయనను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ పదవి నుంచే తొలగించారు. ఇటువంటి వ్యక్తిని బోర్డులోకి తీసుకున్నారు. మరొక బోర్డు సభ్యుడు శరత్‌చంద్రారెడ్డి ఢిల్లీ లిక్కర్‌స్కామ్‌లో నిందితుడు. మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మీద క్రిమినల్ కేసులు వున్నాయి.

దర్జాగా దర్శనాల వ్యాపారం

దేవుడి దర్శనాన్నే వ్యాపారంగా మార్చేశారు. సాధారణ భక్తులను పదుల గంటల పాటు క్యూలైన్లలో పడిగాపులు గాసేలా చేసి, వీవీఐపీల సేవలో తరించారు. బోర్డు సభ్యులు, ఎమ్మెల్యేలు సైతం తిరుమల కొండమీద సొంత పీఆర్వోలను నియమించుకుని దర్శనాల టికెట్లు అమ్ముకున్నారనే ఆరోపణలు ఐదేళ్లూ వెల్లువెత్తినా జగన్ నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండిపోయారు. ఛైర్మన్ కోటాలో రోజుకు పది పన్నెండు మందికి మాత్రమే బ్రేక్ దర్శనాలకు సిఫారసు చేసే సంప్రదాయాన్ని వైసీపీ పాలనలో గాలికి వదిలేశారు. వైవీ సుబ్బారెడ్డి రోజుకు సగటున 364 మందికి వీఐపీ బ్రేక్ టికెట్లను ఇష్టానుసారం ఇచ్చేసేవారు. ఈయన ఛైర్మన్‌గా ఉన్న నాలుగేళ్లలో 3 లక్షలా 60 వేల మందికి ఇట్లా టికెట్లు కేటాయించారంటే టీటీడీని ఎంతగా సొంతానికి వాడేసుకున్నారో అర్థం అవుతుంది. ఆ తర్వాత ఛైర్మన్ అయిన భూమన కరుణాకరరెడ్డి కూడా ఇదే వారసత్వాన్ని కొనసాగించారు. ఉన్నది 9 నెలలే అయినా రోజుకు సగటున 172 మందికి వీఐపీ బ్రేక్ దర్శనాల సిఫారసు లేఖలు ఇచ్చేవారు. ఇక స్వామి దర్శనాలను న్యాయమూర్తులకూ, ఢిల్లీ ప్రముఖులకూ ఎరగా వేసేవారన్న విమర్శలూ జగన్ మీద వచ్చాయి. ధర్మారెడ్డి ఈవోగా ఈ పనిని జగన్ కోసం చేసేవారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా జగన్ మీద అనేక కేసులున్న నేపథ్యంలో న్యాయమూర్తులను ప్రసన్నం చేసుకోవడానికి దర్శనాల సమయంలో వారిని స్వామి ముందు కోరుకున్నంతసేపు ఉంచేసేవారనే ఆరోపణలున్నాయి.

శ్రీవాణిలో ఏం జరిగింది?

దర్శనాలలో దళారీలను తొలగించే లక్ష్యంతో ప్రవేశపెట్టి విజయం సాధించామంటూ అధనపు ఈవో ధర్మారెడ్డి పదేపదే ప్రకటించుకున్న శ్రీవాణిట్రస్టు మీద అవినీతి ఆరోపణలు వెల్లువెత్తినా జగన్ పట్టించుకోలేదు. శ్రీవాణి పేరుతో బ్రేక్ దర్శనాన్ని రూ.10,500గా చేసి రోజుకు వెయ్యి టికెట్లు అమ్మేశారు. ఆ సొమ్ముల లెక్కలు తేల్చనేలేదు. ఆలయాల రిపేర్లకు, నిర్మాణాలకు వాడుతున్నామని చెప్పారు.శ్రీవాణిలో భారీ కుంభకోణం జరిగిందని భక్తులు భగ్గుమనడంతో విచిత్రంగా తిరుపతి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఒక నిజనిర్ధారణ కమిటీ వేసి, అంతా శభాష్ అని ఒక సర్టిఫికెట్ ఇప్పించుకున్నారు.

అద్దెలు మూడు రెట్లు...

తిరుమల కొండమీద వసతి అంటే భక్తులకు ఒకప్పుడు చవగ్గా లభించేది. తక్కువ ఖర్చుతో కుటుంబం అంతా ఒకటి రెండు రోజులు ఈ చల్లని ప్రదేశంలో దేవదేవుని సన్నిధిలో గడిపి వెళ్లేవారు. జగన్ పాలనలో పర్యాటక కేంద్రాలతో పోటీపడేలా ఈ ఆధ్యాత్మిక కేంద్రంలో రేట్లు పెంచేశారు. పాలకమండలి సమావేశంలోనే (17 ఫిబ్రవరి 2022) ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వేలం పాట తరహాలో గదుల అద్దె రేట్లు రెండు మూడు రెట్లు పెంచేలా నిర్ణయం తీసుకున్న వీడియో వైరల్ అయ్యి అందరూ ఇదేమి తీరు అని విస్తుపోయినా జగన్ చలించలేదు. గదుల నిర్వహణ కూడా దారుణంగా తయారైంది. పరిశుభ్రతను పట్టించుకోలేదు.

లడ్డూనే కల్తీ చేసేశారు కదయ్యా!

తిరుమల లడ్డూ అనగానే ఘుమఘుమ లాడేది. ఈ రుచి ఇంకెక్కడా ఎవరు చేసినా సాధ్యం అయ్యేది కాదు. ప్రపంచ పేటెంట్ కూడా తిరుమల లడ్డూకి లభించింది. ఇంతటి ప్రత్యేకత ఉన్న లడ్డూనే జగన్ జమానాలో భ్రష్టు పట్టించేశారు. ఇతర ముడి పదార్థాల సరఫరాకు, కోరుకున్నవారికి వందల కోట్ల టెండర్లు కట్టబెట్టేశారు. తమవాళ్లకే టెండర్లు దక్కేలా చేయడం కోసం ఏకంగా టెండరు నిబంధనలనే మార్చేశారు. రివర్స్ టెండర్ల పేరుతో కనీస నాణ్యత లేని సరుకులతో నింపేశారు. కల్తీ నెయ్యితో లడ్డూ, అన్నప్రసాదాల నాణ్యతనే దెబ్బ తీసేశారు. జగన్ పాలనలో పొందిన టెండరుతో సరఫరా చేసిన నెయ్యిలో పందికొవ్వు, ఆవుకొవ్వు వంటివి ఉన్నాయని తేలడం.. టీటీడీ చరిత్రలోనే ఎన్నటికీ చెరగని మచ్చగా మిగిలిపోయింది.ఆర్గానిక్ ముడి పదార్థాల పేరుతో ఇతర అన్న ప్రసాదాలను కూడా రుచిలేకుండా చేసేశారు.

టీటీడీలోనూ పనులకు పర్సెంటేజీలు

టీటీడీ నిర్మాణ పనులంటే ఒకప్పుడు నాణ్యతకు తిరుగులేదనే పేరుండేది. అందుకు కారణం అవినీతికి అవకాశం పరిమితం కావడమే. కొద్దిమంది అధికారులో, ఉద్యోగులో ఆశపడ్డా కానుకల స్థాయికి మించేది కాదు. జగన్ పాలనలో రాష్ట్రప్రభుత్వం పనుల తరహాలోనే పర్సెంటేజీల విధానం మొదలైంది. నాయకులకు వాటాలు తప్పలేదు. అవసరంతో సంబంధం లేకుండా నిర్మాణ పనులు విపరీతంగా పెంచేశారు. వందల కోట్లు కేటాయించేశారు. దీంతో టీటీడీలోనూ అవినీతి వ్యవస్థగా మారిపోయింది. ముఖ్యంగా ఎన్నికలకు ఏడాది ముందు నుంచీ ఈ పరిస్థితి విపరీతమైందనే ఆరోపణలున్నాయి. తిరుపతిని కేంద్రం చేసుకుని అభివృద్ధి పేరుతో విచ్చలవిడిగా నిధులు విడుదల చేశారు. రోడ్లు, భవనాలకు నాయకులు అడగడం, అధికారులు కేటాయించేయడం జరిగింది. తిరుపతి నాయకుల పర్సెంటేజీల కోసమే రూ. వందల కోట్లు పనులు ఆగమేఘాల మీద మొదలు పెట్టారనే విమర్శలు వచ్చాయి. బాగున్న సత్రాలు కూల్చేసి కొత్తవి నిర్మించడానికి రూ.600 కోట్లు కేటాయించేశారంటే అవినీతి విశ్వరూపం అర్థం అవుతుంది. స్విమ్స్‌లో దివ్యంగా ఉన్న భవనాలను రిపేరు చేయాలంటూ రూ.200 కోట్లు ధారాళంగా కేటాయించేశారు. తిరుపతి నాయకుల ఎన్నికల ఖర్చుల కోసమే ఆగమేఘాల మీద కాంట్రాక్టులు ఇచ్చేశారంటూ ఆరోపణలు వెల్లువెత్తినా జగన్ ప్రభుత్వం.. 'ఏం జరిగింది' అనే ఆరా కూడా తీయలేదు. అర్హత లేని అధికారిని ఇంఛార్జి సీఈగా నియమించారు.నిబంధనలకు విరుద్ధంగా సీనియర్లు వున్నప్పటికీ రెగ్యులర్ సీఈగా అతన్నే కొనసాగించారు. బాధిత అధికారికి న్యాయం చేయాలన్న హైకోర్టు ఆదేశాలు కూడా అమలు కాలేదు.

జిల్లా పాలనలోనూ అదే ముద్ర

జిల్లా తొలి కలెక్టర్‌గా వెంకట్రమణారెడ్డి, తిరుపతి అర్బన్ ఎస్పీగా ఆవుల రమేష్‌రెడ్డి, జిల్లా ఎస్పీగా పరమేశ్వర రెడ్డి, తిరుపతి ఆర్డీవోలుగా కనకనరసారెడ్డి, నిశాంత్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీవోగా రవిశంకర్‌రెడ్డి, ఎస్వీయూ వీసీలుగా రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బర్డ్ స్పెషలాఫీసర్‌గా రెడ్డెప్పరెడ్డి, స్విమ్స్ స్పెషలాఫీసర్‌గా జగదీశ్వర్‌రెడ్డి... ఇలా కీలక స్థానాల్లో ఒకే సామాజికవర్గానికి చెందిన వారే గత ఐదేళ్లలో పనిచేశారు. కనకనరసారెడ్డి బదిలీ అయినా జిల్లా దాటకుండా రుయాలో ఏవోగా నియమితులయ్యారు. జిల్లాలో పలు శాఖల అధికారులుగా, పోలీసు శాఖలో కీలక స్థానాల్లోనూ అదే వర్గానికి చెందిన వారు పనిచేశారు.

జిల్లాలోనూ పవర్ అంతా వాళ్లదే!

జగన్ పాలనలో జిల్లా అంతా ఒకే సామాజికవర్గం మయం అయిపోయింది. పదవులన్నీ వారికే. అధికారులూ వారే. జిల్లాలో ఎనిమిది సెగ్మెంట్లుంటే మూడు ఎస్సీ రిజర్వుడు మినహా మిగతా ఐదు స్థానాల్లో ఒకే సామాజికవర్గం వారు వైసీపీ తరపున ఎమ్మెల్యేలుగా ఉన్నారు. తుడా ఛైర్మన్‌గా చెవిరెడ్డి భాస్కర రెడ్డి మూడున్నరేళ్లు, ఆపై ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి తదుపరి ఏడాదన్నర కొనసాగారు. వీరిద్దరూ టీటీడీ ట్రస్టు బోర్డులో ఎక్స్ అఫిషియో సభ్యులుగా కూడా కొనసాగారు. తిరుపతి కార్పొరేషన్‌లో రెండు మేయర్ పదవుల్లో ఒకటి ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి కుమారుడు అభినయ్ దక్కించుకున్నారు. ఎమ్మెల్యే, తుడా ఛైర్మన్ పదవులకు అదనంగా చెవిరెడ్డి అసెంబ్లీ విప్ పదవి కూడా పొందారు.

తిరుపతిలో టెన్షన్

తిరుమల పవిత్రతను దెబ్బతీసిన జగన్ కొండకు రావద్దంటూ హిందూ సంఘాల నిరసన. క్రిస్టియన్ జగన్ గో బ్యాక్.. అంటూ నినాదాలు. డిక్లరేషన్ ఇవ్వాలంటూ బీజేపీ నేతల డిమాండు. తిరుమలకు రావాలంటే అడ్డుకుంటామని హెచ్చరికలు. శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణల నేపథ్యంలో శ్రీవారిని దర్శించుకునేందుకు మాజీ సీఎం జగన్ శుక్రవారం తిరుమల రానున్న క్రమంలో గురువారం తిరుపతిలో తలెత్తిన పరిణామాలివి. ఈ క్రమంలో తిరుపతిలో టెన్షన్ వాతావరణం నెలకొంది. మరోవైపు వైసీపీ నేతలూ భారీ ఎత్తున జనసమీకరణ చేసినట్లు తెలిసింది. పోలీసులు అడ్డుకోని పక్షంలో జగన్‌నేరుగా తిరుమల వెళతారని, ఎక్కడైనా అడ్డుకుంటే అక్కడే శ్రేణులతో కలసి బైఠాయించాలని నిర్ణయించినట్లు తెలిసింది. తిరుమలకు అనుమతించే వరకూ వెనుదిరగకుండా ఆందోళన చేపట్టడం ద్వారా వివాదం పెద్దది చేసి అందరి దృష్టినీ ఆకర్షించే ప్రయత్నం చేయనున్నట్లు తెలిసింది. వైసీపీ నేతల వ్యూహానికి ప్రతివ్యూహంగా పోలీసులు విమానాశ్రయం వద్దే జగన్‌ను అడ్డుకునే అవకాశముందని సమాచారం. విమానాశ్రయంలోనే ఆయనకు నోటీసులు ఇచ్చి, శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం వెనుదిరిగి పోవాల్సిందిగా కోరనున్నట్లు సమాచారం. అలా కాకుండా వెలుపలికి రావాలని యత్నిస్తే అడ్డుకునే అవకాశముంది. దీనికోసం విమానాశ్రయం వద్ద ఇప్పటికే పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

జగన్ షెడ్యూల్ ఇలా: శుక్రవారం సాయంత్రం 5 గంటలకు విమానాశ్రయానికి రాక. రోడ్డు మార్గాన 7 గంటలకు తిరుమల చేరిక. రాత్రికి పద్మావతి అతిథి గృహంలో బస. శనివారం ఉదయం 10.30 గంటలకు శ్రీవారి దర్శనం. మధ్యాహ్నం తిరుగు ప్రయాణం.

– తిరుపతి, ఆంధ్రజ్యోతి

జిల్లాలో 30 పోలీసు యాక్టు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 26: జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి 30 పోలీసు యాక్టు అమల్లోకి వచ్చింది. అక్టోబరు 24వ తేది వరకు ముందస్తు అనుమతి లేకుండా ఎవరూ సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదని ఎస్పీ సుబ్బరాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ పార్టీల నాయకులు, సంస్థలు, వివిధ సమూహాలు, ప్రజలు ఈ ఉత్తర్వులను పాటిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



● వెంకటగిరికి పోటెత్తిన భక్తజనం ● చల్లంగ చూడమ్మ తల్లి అంటూ మొక్కులు ● వేడుకగా అమ్మవారి విరూపోత్సవం

పోలేరమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

● వెంకటగిరిలో ఎటుచూసినా జనసందోహమే ● పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొన్న భక్తులు





వేయికళ్ల దుత్తలతో అమ్మవారి దర్శనానికి.. - పొలి టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకోవడానికి పోటెత్తిన భక్తులు

వెంకటగిరి/ వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 26: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. క్యూలో నిలబడి దర్శించుకున్నారు. జాతరలో భాగంగా గురువారం తెల్లవారుజామున అమ్మవారు భక్తుల దర్శనార్థం దేవస్థానం వద్ద వేపమండలతో పందిరి వేసి కొలువు తీర్చారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి వేయికళ్ల దుత్తల్లో దీపాలు వెలిగించి నెత్తిన పెట్టుకు వచ్చి నాలుగు కూడల్లో బద్దలు కొట్టారు. మడిచీరలపై నడుస్తూ కొందరు.. నవధాన్య మొలకలను అమ్మవారికి సమర్పించుకొని ఇంకొందరు మొక్కులు చెల్లించుకున్నారు. నగరి ఆభరణాలైన బంగారు శూలం, సరుడును రాజా అనుచరుల ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకరించి తీసుకెళ్లారు. దీంతో వెట్టివారు కుండలో వెలిగించిన గండర దీపాన్ని అమ్మవారికి చూపించి దీపం ఆరకుండా ఊరి పొలిమేరల్లోకి తీసుకుపోయి ఉంచారు. అక్కడ అమ్మవారి బలి దున్నపోతును తెగనరికి ఆ రక్తంతో పొలికుండల్లోని అన్నంతో కలిపి ఊరి పొలిమేరల్లో పొలి..పొలి అని అరుస్తూ చల్లారు. దున్నపోతు రక్తంతో తడిచిన కత్తిని అమ్మవారికి చూపాక.. పూలతో అలంకరించిన ట్రక్కులో అమ్మవారి ప్రతిమను ఉంచి విరూపమహోత్సవం నిర్వహించారు. శివాలయం వద్దకు చేరుకోగా అమ్మవారికి అలంకరించిన ఆభరణాలను తీసేశారు. అనంతరం కైవల్యానది మీదుగా మల్లయ్య తోట వద్ద ఏర్పాటు చేసిన విరూప మండపంలో అమ్మవారి ప్రతిమను విరూపం గావించారు. అప్పటి వరకు గండర దీపం ఆరిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అమ్మవారి మట్టిని ఇంట ఉంచుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయని, తింటే రోగాలు దూరమవుతాయన్నది స్థానికుల నమ్మకం. దీంతో అమ్మవారి మట్టిని దక్కించుకునేందుకు భక్తులు పోటీపడటంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమ్మవారికి రాజాలు సమర్పించిన ఆభణాలతోపాటు, స్వర్ణ కిరీటం అలంకరించారు. ఈ ఏడాది జాతర ఏర్పాట్లపై ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టి సారించారు.

తప్పెవరిది?

ఘటోత్సవంలో పొలికుండలు, బలిదున్న పోతును వాహనంపై ఊరేగించడం.. రాజాల వంటశాలకు బలిదున్న పోతును తీసుకెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం రాత్రి జాతర ఊరేగింపులో, గురువారం అమ్మవారి విరూపోత్సవంలో సంప్రదాయం ప్రకారం రాజాల నగిరి నుంచి పంపే సప్పరం వినియోగించాలి. ఈ ఆచారానికి గత పాలకులు చరమ గీతం పాడి.. రథానికి బదులు ట్రాక్టరును వినియోగించారు. దీనిని అప్పట్లో తప్పు పట్టిన ఎమ్మెల్యే కురుగొండ్ల అదే ఆనవాయితీని కొనసాగించడం ఏమిటని స్థానికులు ప్రశ్నించారు. సప్పరంపై అమ్మవారిని ఊరేగిస్తే రోడ్డుకు రెండువైపులా ఉన్న భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కలిగే అవకాశం ఉండేదని స్థానికులు అంటున్నారు. ఇలా.. జాతర ఆచార వ్యవహారాల్లో తప్పిదం పాలకులదా? పాలకవర్గానిదా? లేదా అధికారులదా? అన్న చర్చ సాగుతోంది.



అమ్మవారి మట్టి కోసం తోపులాట

పోలీసుల వైఫల్యం

జాతర నిర్వహణలో పోలీసుల వైఫల్యం కనిపించింది. భారీ బందోబస్తు ఏర్పాటుచేసినా వారిని సమన్వయ పరుచుకోవడంలో ఉన్నతాధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి. ఈ ఏడాది కూడా పోలీస్, అధికారుల బంధువులకు వీవీఐపీ దర్శనాలు పెచ్చుమీరడం వల్ల సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓ దశలో ఎమ్మెల్యే కురుగొండ్ల జోక్యం చేసుకొని వీఐపీ దర్శనాలను కొంతసేపు నిలిపి వేయించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు లేక మండటెండలో గంటల తరబడి వాహనాలు ఆగిపోవడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడ్డారు. పోలీస్, అధికారుల సిఫారసు ఉన్న వారి వాహనాలను మాత్రం రాజమార్గంలో గుడి దగ్గర వరకు వెళ్లనివ్వడంతో కొన్నిచోట్ల ప్రజలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

జాతర ఏర్పాట్లు ఫెయిల్: మంత్రి ఆనం

పోలీసుల నిర్లక్ష్యంతో పోలేరమ్మ జాతర ఫెయిల్ అయిందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. పోలేరమ్మకు రాష్ట్ర ప్రభుత్వం తరపున గురువారం ఆయన పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉన్న తాను పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలని పోరాడామన్నారు. గతేడాది ప్రభుత్వం గుర్తింపునిచ్చినా నిధులను విడుదల చేయలేదని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అమ్మవారి జాతరకు రాష్ట్ర పండుగగా గుర్తింపునిస్తూ రూ.50 లక్షలు అందించిందన్నారు. ఈ జీవోను కలెక్టర్ వెంకటేశ్వర్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు అందించారు. అనంతరం కురుగొండ్ల రామకృష్ణ వీరిని సన్మానించగా వేదపండితులు ఆశీర్వచనం పొందారు.





పోలేరమ్మకు రాజాల సారె తీసుకుని వస్తున్న రాజా కుటుంబీకులు సర్వజ్ఞయాచేంద్ర



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రులు కందుల సురేష్, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



పోలేరమ్మకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల దంపతులు



అమ్మవారి దర్శనానికి వెళుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



కర్ణాటక హైకోర్టు జడ్జి సుమలతకు వేద పండితుల ఆశీర్వచనం



అమ్మవారికి సారె తెస్తున్న ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి

పారదర్శక పాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధ్యక్షుడు మురళి

భాకరాపేట, సెప్టెంబరు 26: పారదర్శక పాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మండల టీడీపీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి అన్నారు. చిన్న గొట్టిగల్లు మండలం దీన్‌దార్లపల్లెపంచాయతీలో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మౌలాలి, చలపతి, మునిస్వామి నాయుడు, శంకర, మున్నాసాహెబ్, ఖాదర్‌వల్లీ, వెంకటరామయ్య, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'తిరుమల పవిత్రతను భ్రష్టుపట్టించిన వైసీపీ'



మాట్లాడుతున్న శివకుమార్

భాకరాపేట, సెప్టెంబరు 26: వైసీపీ హయాంలో తిరుమల పవిత్రతను భ్రష్టుపట్టించారని టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్ విమర్శించారు. చిన్నగొట్టిగల్లులో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు తిరుమలను వ్యాపార కేంద్రంగా మార్చేశారన్నారు. కల్తీ నెయ్యితో లడ్డూ ప్రసాదాన్ని తయారుచేసి తిరుమలను అపవిత్రం చేశారన్నారు. ఆధారాలతో ప్రభుత్వం బయటపెట్టినా పశ్చాత్తాప పడకుండా ఎదురు దాడి చేస్తున్నారన్నారు. 28న జగన్ తిరుమలకు రావడం తగదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాభ్యాసంతో పాటు సేవాదృక్పథం



ఆవరణను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

భాకరాపేట, సెప్టెంబరు 26: విద్యార్థులు చదువుతోపాటు సేవా గుణాన్ని అలవరుచుకోవాలని జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ నాగరాణి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హానికరం కాని వస్తువులను మాత్రమే ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి రవీంద్ర, అధ్యాపకులు సునంద, మల్ రెడ్డి, ఆంజనేయులు, నాగభూషణం, సుజాత, హేమలత, పూర్ణచంద్రిక, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీపురం డీటీగా అన్వర్‌బాషా

రామచంద్రాపురం, సెప్టెంబరు 26: మండల డిప్యూటీ తహసీల్దారుగా ఎం.అన్వర్‌బాషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన పునితారాణి శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. అలాగే మండల సర్వేయర్‌గా రమేష్‌బాబు తిరుపతి అర్బన్ మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడి సర్వేయర్ హేమకుమార్ తిరుపతి రూరల్ మండలానికి బదిలీ అయ్యారు. తాజాగా బాధ్యతలు స్వీకరించిన వీరిద్దరికీ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

కాలినడక మార్గంలో దుకాణ వివాదం

తిరుమల, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడక మార్గంలో దుకాణ ఏర్పాటుయత్నాన్ని స్థానిక దుకాణదారులు అడ్డుకున్నారు. ఏడవ మైలు వద్ద గురువారం కొంతమంది కొత్తగా దుకాణం ఏర్పాటుకు ప్రయత్నించారు. అక్కడి వ్యాపారులు గుర్తించి అనుమతి లేకుండా ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో అక్కడి వ్యాపారులు దీనిని వీడియోను తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఎమ్మెల్యే పేరును వాడి ఫారెస్ట్ విభాగం అనుమతి ఉందని చెప్పి కొందరు తమ వ్యాపారాలు దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని వీరు ఆవేదన వ్యక్తం చేశారు. ఫారెస్ట్ డీఎఫ్‌వో స్పందిస్తూ తాము ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకువెళతామన్నారు.

చంద్రగిరి కోటకు పూర్వ వైభవం..

● ఆరేళ్ళ తరువాత నేడు సౌండ్, లైటింగ్ షో పునఃప్రారంభం



చంద్రగిరి, సెప్టెంబరు 26: చంద్రగిరి కోట పూర్వ వైభవం సంతరించుకోనుంది. ఆరేళ్ల తరువాత సౌండ్, లైటింగ్ షోను పునఃప్రారంభించనున్నారు. 2000లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టూరిజం శాఖ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలతో కోటలో సౌండ్ అండ్ లైటింగ్ షోను ఏర్పాటు చేశారు. దీనికి విశేషాదరణ లభించింది. 2004లో కోట ఆవరణలోని కోనేరులో బోటింగ్ కూడా ఏర్పాటు చేశారు. 2017లో మరో అడుగు పడింది. రూ.3.5కోట్లతో చెన్నైకు చెందిన లక్స్ అండ్ డిజిబుల్ సంస్థ ద్వారా సౌండ్ అండ్ లైటింగ్ షోను మరింత ఆధునీకరించారు. 2018 జూలైలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురవడంతో రాజ గోపురంపై పిడుగు పడింది. అప్పటి నుంచి లైటింగ్ షో మూలకు చేరింది. తర్వాత టీడీపీ ప్రభుత్వం మారిపోయింది. వైసీపీ ప్రభుత్వం కొన్నాళ్లు పట్టించుకోలేదు. ఎన్నికలు సమీపిస్తుండటంతో గతేడాది లైటింగ్ షో పునరుద్ధరణకు చర్యలు తీసుకుంది. లక్స్ అండ్ డిజిబుల్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఈ ఏడాది ఎన్నికల ముందు పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక చొరవ తీసుకోవడంతో సౌండ్, లైటింగ్ షో ప్రారంభానికి సిద్ధమైంది. పర్యాటక దినోత్సవ నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్ దీనిని ప్రారంభించనున్నారు. ఫలితంగా కోటకు మళ్లీ పర్యాటక శోభ చేకూరనుంది.

ప్రకృతి వ్యవసాయ విధానాలు భేష్

● మాలి దేశస్థుల కితాబు



సూర్యమండల ఆకృతిలోని ప్రకృతి వ్యవసాయ పంటను పరిశీలిస్తున్న మాలి దేశస్థులు

తిరుచానూరు, సెప్టెంబరు 26: తిరుపతి రూరల్ మండలం వేమూరులోని అయ్యప్పనాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం మాలి దేశస్థులు సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే వావిలాకు, తూటికాడ, ఉమ్మెత్త కషాయాలు, పేడ, మూత్ర, ఇంగువ ద్రావణాల తయారీపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజరు షణ్ముగం సాగు వివరాలను తెలిపారు. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో ఏటీఎం, ఏగ్రేడ్ మోడల్‌ను వారు సందర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు రైతు అయ్యప్పనాయుడు తెలిపారు. మాలి ప్రతినిధి బృందం సభ్యుడు రమదాన్ సిల్లా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సూత్రాలు తమకు ఎంతగానో నచ్చాయన్నారు. తమ దేశంలో కూడా ఈ తరహా సాగుపై శిక్షణ ఇస్తామన్నారు. సీనియర్ కన్సల్టెంట్ సురేంద్ర రెడ్డి, జిల్లా అడ్వైజర్ రవిచంద్ర ప్రసాద్, అడిషనల్ ప్రాజెక్టు మేనేజరు పట్టాభిరెడ్డి, ఎన్ఎఫ్ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు. **రామచంద్రాపురం:** మండలంలోని సీకేపల్లి టీవీ సఫార్లు గ్రామాల్లో ప్రకృతి సాగును మాలి దేశస్థుల బృందం పరిశీలించింది. టీవీ సఫారిలోని మహిళా రైతు శాంత సూర్యమండలాకృతిలో కూరగాయల సాగు పద్ధతులు, ఆదాయ వనరుల గురించి వివరించారు. సీకేపల్లిలో న్యూట్రిగార్డెన్ ప్రయోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. రామాపురంలో మహిళ సంఘాలతో సమావేశమయ్యారు.



తిరుచ్చిపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతు దర్శనం

చంద్రగిరి, సెప్టెంబరు 26: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం తిరుచ్చి వాహనంపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతు ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టించారు. తిరుచ్చి వాహనంపై స్వామి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌కు వీడ్కోలు

చంద్రగిరి, సెప్టెంబరు 26: సబ్ రిజిస్ట్రార్ మోహన్‌బాబును గురువారం చంద్రగిరిలోని డాక్యుమెంట్ రైటర్లు సన్మానించారు. ఆయన ఇటీవల నగరికి బదిలీ అయిన నేపథ్యంలో డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీఎం కేశవులు ఆధ్వర్యంలో పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో చంద్రగిరిలోని డాక్యుమెంట్ రైటర్స్ సుబ్రమణ్యం నాయుడు, శ్రీకాంత్, శ్రీను, చంద్రబాబు, మల్లికార్జున, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు



పవన్ సమక్షంలో జనసేనలో చేరిన కిలారి వెంకట రోశయ్య, రవిశంకర్

తిరుపతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీలోకి మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, ప్రముఖ పారిశ్రామికవేత్త కంది రవిశంకర్ గురువారం సాయంత్రం చేరారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కిలారి వెంకట రోశయ్య వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరడంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కీలకంగా వ్యవహరించారు. అలాగే ఒంగోలుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కంది రవిశంకర్ చేరడంలోనూ ఆరణి పాత్ర ఉంది. కిలారి రోశయ్య ఆరణి శ్రీనివాసులుకు వియ్యంకులు కాగా రవిశంకర్ కిలారికి వియ్యంకులవుతారు. ఈ కార్యక్రమంలో ఆరణి మదన్, ఆరణి జగన్‌లు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



రామచంద్రాపురం, సెప్టెంబరు 26: అక్టోబరు 3 నుంచి నిర్వహించనున్న దేవీ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రతాప్‌స్వామి అన్నారు. రామచంద్రాపురంలో గురువారం ఆయన దసరా ఉత్సవాల కరపత్రాలను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూరావారిపల్లి గొల్లపల్లిలోని సురభి గోసంరక్షణశాలలో అక్టోబరు 3వ తేదీ ఉదయం దీక్షాదారులకు కంకణధారణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 12న దీక్షణ విరమణ ఉంటుందన్నారు.

బ్రహ్మోత్సవాల్లో ట్యాక్సీలకు పరిమిత ఎంట్రీ



డ్రైవర్లతో మాట్లాడుతున్న పోలీసు, విజిలెన్స్ అధికారులు

తిరుమల, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అక్టోబరు4 నుంచి 12 వరకు ట్యాక్సీలను జీఎన్సీ నుంచి పీఏసీ3 వరకే అనుమతిస్తారని డీఎస్పీ విజయ్‌శేఖర్ తెలిపారు. తిరుమల ఆస్థాన మండపంలో గురువారం ఆయన ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, విజిలెన్స్ వీఎస్వో సురేంద్రతో కలిసి ట్యాక్సీ డ్రైవర్లతో మాట్లాడారు. డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. గరుడసేవ రోజు తిరుమలకు ట్యాక్సీల అనుమతి లేదని స్పష్టం చేశారు. భక్తులతో దురుసుగా మాట్లాడకూడదన్నారు. వేగంగా నడపకూడదని ఆదేశించారు. ఏవీఎస్వోలు గిరిధర్, శైలేంద్ర, శివయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పారిశుధ్య కార్మికులతో హెల్త్‌ఆఫీసర్ మధుసూధన్‌రావు, ఏవీఎస్వో గిరిధర్ మాట్లాడారు. అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

శ్రీకాళహస్తి ఆర్డీవోగా భానుప్రకాష్

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 26 : జిల్లాలో ఇద్దరు ఆర్డీవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాళహస్తిలో పనిచేస్తున్న రవిశంకర్‌రెడ్డిని జీఏడీకి రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. అక్కడ డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న భానుప్రకాష్ రెడ్డిని శ్రీకాళహస్తి ఆర్డీవోగా నియమించింది. ఇక సూళ్లూరుపేట ఆర్డీవోగా పనిచేస్తున్న చంద్రమునిని జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. ఎన్టీఆర్ జిల్లా కోనేరు రంగారావు కమిటీలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఈతమాకుల కిరణ్మయిని సూళ్లూరుపేట ఆర్డీవోగా నియమించింది. జిల్లాలో అత్యంత కీలకమైన తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి ఇటీవల అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయ్యారు. ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. శుక్రవారం మరికొంత మంది డిప్యూటీ కలెక్టర్లు బదిలీ కానున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల (ఆర్డీవోలు) బదిలీల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం శిక్షణ పూర్తి చేసుకున్న డిప్యూటీ కలెక్టర్లకు ప్రాధాన్యత ఇవ్వడం గమనార్హం.

సమస్యలు పరిష్కరించి రుణం తీర్చుకుంటా

'ఇది మంచి ప్రభుత్వం' ముగింపులో ఎమ్మెల్యే ఆరణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను పరిష్కరించి, వారి రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట ఏడు రోజుల పాటు జరిగిన కార్యక్రమం గురువారం ఎమ్మార్ పల్లి సర్కిల్లో కమిషనర్ ఎన్.మౌర్య అధ్యక్షతన ముగిసింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన హామీలను ప్రజలకు వివరించారు. 50 డివిజన్లలోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. కాగా వేంకటేశ్వర స్వామి దర్శనానికి హిందూయేతరులు వస్తే తమకు శ్రీవారి పట్ల విశ్వాసం ఉందని సంతకం చేయాలనే నిబంధనను జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లలో పాటించ లేదని ఆరోపించారు. ఏ ముఖం పెట్టుకుని స్వామి దర్శనానికి వస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నాయకులు నరసింహ యాదవ్, శ్రీధర్ వర్మ, సూరా సుధాకర్ రెడ్డి, మురళీనాథరెడ్డి, చిన బాబు, మహేష్ యాదవ్, ఇనుకొండ సుబ్రమణ్యం, జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రాజారెడ్డి, డాక్టర్ ఆకుల వనజ పాల్గొన్నారు.

టైక్వాండో పోటీలలో ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 26: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి టైక్వాండో పోటీలలో తిరుపతి క్రీడాకారులు ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్ 14, 17, 19 విభాగాలలో బరువు ప్రాతిపదికన పోటీలు నిర్వహించగా అండర్ 17లోని 59కిలోల విభాగంలో శ్రీచైత్ర, 41కిలోల విభాగంలో పి.విహాన్, అండర్ 14లోని 55కిలోల విభాగంలో టి.వీక్ష బంగారు పతకాలు సాధించారు. శిక్షకుడు ఎ.బాలకృష్ణన్, పలువురు క్రీడా ప్రముఖులు వారిని అభినందించారు.

రేపు యువజనోత్సవాలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 26: వివేకానంద జయంతి సందర్భంగా శనివారం యువజనోత్సవాలు నిర్వహించనున్నామని సెట్విన్ సీఈవో మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలాజీకాలనీలోని ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో ఉదయం 9.30గంటల నుంచి సాంస్కృతిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. మొదటి స్థాయిలో గెలుపొందిన కళాకారులకు రాష్ట్రస్థాయి, అక్కడ గెలుపొందితే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందని తెలిపారు. జానపద నృత్యాలు, గీతాలు, కవిత్వం, వ్యాసరచన, పెయింటింగ్ వంటి పోటీలు ఉంటాయని, మరిన్ని వివరాలకు 0877-2286921, 7036428762లలో సంప్రదించాలని కోరారు.

పద్మావతి డిగ్రీ కాలేజీ స్టూడెంట్ కౌన్సిల్ అధ్యక్షురాలిగా సోని

నేడు నూతన స్టూడెంట్ కౌన్సిల్ బాధ్యతల స్వీకరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 26: పద్మావతి డిగ్రీ-పీజీ కాలేజీ స్టూడెంట్ కౌన్సిల్ అధ్యక్షురాలిగా పి.సోని నియమితులయ్యారు. ఈమె బీకాం థర్డ్ ఇయర్ చదువుతున్నారు. ఈమెతో పాటు నూతన స్టూడెంట్ కౌన్సిల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించనుంది. ఉదయం కాలేజీలో నిర్వహించే కార్యక్రమానికి జేఈవో గౌతమి, పద్మావతి వర్సిటీ రిజిస్ట్రార్ రజని, డీఈవో నాగరాజునాయుడు, ప్రిన్సిపాల్ నారాయణమ్మ పాల్గొంటారని కాలేజీ మీడియా కో-ఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు.


వాలీబాల్ పోటీల్లో ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలురు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 26: ఉమ్మడి జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 ఆధ్వర్యంలో ఎస్వీయూ క్యాంపస్‌స్కూల్ మైదానంలో గురువారం జరిగిన వాలీబాల్ పోటీలలో 130 మంది పాల్గొనగా 15మంది చొప్పున బాలబాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కార్యదర్శి జయరామయ్య తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ హెచ్‌ఎం ఐ.సకీనమ్మ, షణ్ముగం, శ్రీనివాసులు, ప్రశాంతబాబు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

చెర్లోపల్లె క్రాస్‌లో ఫ్రీ లెఫ్ట్ నిర్మాణ పనులు



చెర్లోపల్లె క్రాస్ వద్ద ఫ్రీ లెఫ్ట్ నిర్మాణ పనులు

తిరుపతి రూరల్, సెప్టెంబరు 26: తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లె జంక్షన్ నుంచి వకుళామాత ఆలయం వరకు లింక్ రోడ్డు నిర్మాణంలో భాగంగా గురువారం చెర్లోపల్లె క్రాస్ వద్ద డైవర్షన్ (ఫ్రీలెఫ్ట్) పనులు చేపట్టారు. ఈ రోడ్డుకు సంబంధించి దాదాపు 70 శాతం పనులు పూర్తికాగా రైతులకు తుడా టీడీఆర్ బాండ్లు ఇవ్వడంలో జాప్యం కారణంగా 30 శాతం పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. వచ్చే ఏడాది జనవరి మొదటి వారానికి పూర్తి చేసేలా చూస్తున్నామని కాంట్రాక్టర్ శుభగిరినాయుడు తెలిపారు.

తిరుపతి బస్టాండులో చెత్త తొలగింపు



బస్టాండు శుభ్రతకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న కార్మికులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 26: ఏపీఎస్ ఆర్టీసీ, నగరపాలక సంస్థ సిబ్బంది గురువారం ఉదయం సెంట్రల్ బస్సుస్టేషన్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. బస్టాండు నలువైపులా చెత్తను తొలగించారు. వారంలో ఒక రోజు పరిశుభ్రతకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఏటీఎం డి.రామచంద్రనాయుడు, మున్సిపల్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ సుమతి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో కంటి వైద్య శిబిరం



తిరుపతి(విద్య), సెప్టెంబరు 26: జీఎస్ మాడ వీధిలోని శ్రీచైతన్య స్కూల్‌లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా వాసన్ ఐకేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, టీచర్లకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఏజీఎం జి.సురేష్, ప్రిన్సిపాల్ జయప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌బాబు, డీన్ సురేష్, సీఅండ్‌ఎం ఇన్‌చార్జి నరేంద్ర, ఆస్పత్రి డీజీఎం బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

జాషువాకు ఘన నివాళి



తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 26: మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో పలువురు కళాకారులు ఘన నివాళి అర్పించారు. హెడ్ పోస్టాఫీసు వద్ద ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. జాషువా సాహిత్యం ఉన్నతమైందని, ఆయన రచించిన హరిశ్చంద్ర నాటకంలోని పద్యాలు తెలుగు వారు మరువలేరని రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపినాథ్ రెడ్డి అన్నారు. సంస్థ కార్యదర్శి కేఎన్ రాజ, సభ్యులు కాస్స పద్మనాభం, సుబ్రమణ్యం రెడ్డి, చెంగల్ రాయలు, పుత్తూరు శివప్రసాద్ రెడ్డి, ఈశ్వరి, బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామాయణ సంజీవని పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు, ఎన్ఎస్‌యూ వీసీ

తిరుపతి రూరల్, సెప్టెంబరు 26: స్థానిక సంస్కృత వర్సిటీ ఆధ్వర్యంలో రూపొందించిన శ్రీరామాయణ సంజీవని పుస్తకాన్ని గురువారం విజయనగరంలో నిర్వహించిన సదస్సులో మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ ఎం.వెంకయ్యనాయుడు చేతులమీదుగా ఆవిష్కరించారు. విజయనగరంలో నిర్వహించిన వాల్మీకి రీసెర్చ్ సెంటర్ ఇన్ రామాయణం, శ్రీరామాయణ శంఖారావ ప్రారంభానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్యనాయుడితో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, కో-ఆర్డినేటర్స్ ప్రొఫెసర్ రంగనాథన్, ప్రొఫెసర్ ఆర్.చంద్రశేఖర్‌లు కలసి రీసెర్చ్ పేపర్స్ సంకలనంతో కూడిన ఈ పుస్తకాన్ని విడుదల చేశారని పీఆర్వో డాక్టర్ కె.కుమార్ పేర్కొన్నారు. రామాయణాన్ని పాఠ్యాంశాలుగా చేర్చి విద్యార్థులకు బోధించడం ద్వారా భారతజాతి మరింతగా అభివృద్ధి సాధిస్తుందని వెంకయ్యనాయుడు ఉపన్యసించారని తెలిపారు. కాగా విజయనగరంలోని ఈ కేంద్రాన్ని సంస్కృత వర్సిటీకి అనుబంధంగా నిర్వహించేందుకు ఇటీవల పరస్పర అవగాహనా ఒప్పందం(ఎంవోయూ) చేసుకున్నామని ప్రకటించారు.

నేటి నుంచి ఎస్వీయూలో క్యాంపస్ సెలక్షన్స్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 26: ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగంలో శుక్రవారం నుంచి క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు సాగే ఈ సెలక్షన్స్ ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నాయి. న్యూ ఎంబీఏ బిల్డింగ్‌లోని రూమ్ నెంబరు-215లో ఈ మేళా నిర్వహిస్తారు. అభిరామ్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఈ సెలెక్షన్స్ చేపట్టనుంది. 2021లోపు డిగ్రీ పూర్తయిన వారు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, కాలేజీ ఐడీ కార్డు, రెండు ఫొటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కంప్యూటర్ సైన్స్ విభాగ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జీవీ రమేష్ బాబు తెలిపారు.

పశువైద్యశాలలో స్వచ్ఛతా హి సేవ



తిరుపతి రూరల్, సెప్టెంబరు 26: నగరంలోని తాతయ్యగుంట వద్దనున్న పట్టణ పశువైద్యశాలలో ఎస్వీ వెటర్నరీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. పశువైద్యశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. కాగా, ఆస్పత్రి నుంచి తుడా కార్యాలయం వరకు పర్యావరణ పరిరక్షణ అవగాహనా ర్యాలీ నిర్వహించి, ప్రజలను చైతన్యపరిచారు. అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీనివాసరావు, అమరావతి, రాజా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరిశుభ్ర తిరుపతికి సహకరించండి



3కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 26 : తిరుపతి నగరాన్ని శుభ్రంగా ఉంచి, దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం చేపట్టిన 3కే రన్‌ను కమిషనర్ మౌర్యతో కలసి ఆయన వివేకానంద కూడలి వద్ద ప్రారంభించారు. టౌన్‌క్లబ్, బాలాజీకాలనీ మీదుగా ఎస్వీయూ వరకు సాగిన రన్‌లో యువకులు, విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కోసమే స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అక్టోబర్ ఒకటో తేదీన పరిశుభ్రతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని, మ్యాప్ మై ఇండియా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పారిశుధ్య సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తామని అన్నారు. జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



నాగరాజు నాయక్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 26: ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ పరిశోధకులు ఎం.నాగరాజు నాయక్ డాక్టరేట్ పొందారు. ప్రైవసీ ప్రిజర్వేషన్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ ఇన్ క్లౌడ్ విత్ సీఎస్ఎన్ అండ్ హైబ్రీడ్ క్రిప్టోగ్రాఫిక్ స్కీం అంశంపై ప్రొఫెసర్ పద్మావతమ్మ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

ఈస్ట్ సీఐ బాధ్యతల స్వీకరణ



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 26 : తిరుపతి ఈస్ట్ సీఐగా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ట్రాఫిక్‌లో పనిచేస్తున్న ఆయన్ను తాజాగా జరిగిన సీఐల బదిలీల్లో తిరుపతి ఈస్టుకు నియమించారు. సీఐ మాట్లాడుతూ తన పరిధిలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానన్నారు.

కుష్ఠు నిర్మూలనకు కృషి చేయాలి



డీపీఎంవోలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 26 : కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి, నిర్మూలన దిశగా కృషి చేయాలని డీఎంహెచ్‌వో శ్రీహరి అన్నారు. స్థానిక డీఎల్‌వో కార్యాలయంలో గురువారం లెప్రసీ నోడల్, పారా మెడికల్ అధికారులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా వచ్చారు. కుష్ఠు వ్యాధి సర్వేను నిరంతరం కొనసాగించాలని, అప్పుడే నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎయిడ్స్, క్షయ వంటి వ్యాధులపైనా అవగాహన పెంచాలన్నారు. అనంతరం ఇటీవల నిర్వహించిన కుష్ఠు వ్యాధి సర్వేలో ప్రతిభ కనబరచిన అధికారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా మలేరియా అధికారి రూప్‌కుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ డిజైన్స్ ఎస్ఈగా శారద

● పలువురు ఈఈల బదిలీలు

తిరుపతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో డిజైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈగా ఓరింపాటి శారద నియమితులయ్యారు. ఇప్పటి వరకూ కడప జిల్లా ఇరిగేషన్ శాఖలో డిజైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈగా ఉన్న ఆమె గురువారం ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా తిరుపతికి బదిలీ అయ్యారు. శ్రీకాళహస్తి తెలుగు గంగ ప్రాజెక్టు గాలేరు-నగరి విభాగం ఒకటవ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సుబ్రమణ్యం మంజుల కడప జిల్లా ఎస్‌కేడీ జీఎన్ఎస్ఎస్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. నెల్లూరు జిల్లా సోమశిల ప్రాజెక్టు 2వ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా వ్యవహరిస్తున్న ఇరగా శ్రీనివాసరావు అక్కడ నుంచీ గూడూరు ఎన్ఎస్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. అనంతపురం తుంగభద్ర ప్రాజెక్టు కార్యాలయం నుంచీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రజావత్ సునీల్ నాయక్ తిరుపతి తెలుగు గంగ చీఫ్ ఇంజనీర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. విజయనగరం జిల్లా బొబ్బిలి నుంచీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరాజు రేణిగుంట జీఎన్ఎస్ఎస్ డివిజన్‌కు బదిలీ అయ్యారు.

నేడు చంద్రగిరి కోటకు హెరిటేజ్ వాక్

చంద్రగిరి, సెప్టెంబరు 26 : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా చంద్రగిరి టవర్ క్లాక్ కూడలి నుంచి కోట వరకు పాఠశాల విద్యార్థులతో హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నట్లు ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ గిరిధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ర్యాలీ ప్రారంభవుతుందని, కోట ప్రాంగణంలో పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు బాలకథానిధి పుస్తకావిష్కరణ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 26: జాషువా జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా పరిషత్ పాఠశాల, మంగళం ట్రెండ్స్‌లో బాలకథానిధి కథల పుస్తకావిష్కరణ సభ నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు జరిగే సభలో డీఈవో వి.శేఖర్ ఆ పుస్తకాన్ని అవిష్కరిస్తారు. సంచిక సంపాదకులు నెమిలేటి కిట్టన్న, సాకం నాగరాజ, జిల్లా ఉప విద్యాధికారి కె.బాలాజి, మండల విద్యాశాఖ అధికారి బి.భాస్కరనాయుడు, పాఠశాల హెచ్‌ఎం సి.కేశవులు నాయుడు పాల్గొంటారు. కాగా, ఉదయం 10.30 గంటలకు కర్నూలుకు చెందిన దంత వైద్యుడు డాక్టర్ బొరెల్లి హర్ష అవధానం ఉంటుంది.



రష్ ఆస్పత్రి దారిలో కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగుతూ మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దారి పొడవునా నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంలో అనేక ఆస్పత్రులు ఉండడంతో వచ్చే రోగులు, వారి సహాయకులు ఈ రొచ్చులో నడవలేక అవస్థలు పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- తిరుపతి అర్బన్

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.50 కోట్లు

తిరుమల, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.50 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు టీటీడీ గురువారం ఉదయం వివరాలను ప్రకటించింది. బుధవారం 77,939 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,668 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

శ్రీవారి సేవలో తెలంగాణ గవర్నర్



జిష్ణుదేవ్ శర్మ - సంజయ్‌శర్మ

తిరుమల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలో జరిగిన అర్చన సేవలో ఆయన కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. గవర్నర్‌కు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. రాజస్థాన్ మంత్రి సంజయ్ శర్మ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

టూటౌన్ సీఐగా శ్రీరాముడు



తిరుమల, సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి): తిరుమల టూటౌన్ సీఐగా శ్రీరాముడు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో సీఐగా ఉన్న మురళీమోహన్‌రావు బదిలీ కాగా క్రైం సీఐగా ఉన్న శేషగిరికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈక్రమంలో తిరుపతి పీటీసీలో ఉన్న శ్రీరాముడిని టూటౌన్ సీఐగా నియమించిన నేపథ్యంలో గురువారం తిరుమలలో బాధ్యతలు స్వీకరించారు.

పోలేరమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

● వెంకటగిరిలో ఎటుచూసినా జనసందోహమే ● పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్న భక్తులు





వేయికళ్ల దుత్తలతో అమ్మవారి దర్శనానికి.. - పోలి టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకోవడానికి పోటెత్తిన భక్తులు

వెంకటగిరి/ వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 26: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. క్యూలో నిల బడి దర్శించుకున్నారు. జాతరలో భాగంగా గురువారం తెల్లవారు జామున అమ్మవారు భక్తుల దర్శనార్థం దేవస్థానం వద్ద వేపమం డలతో పందిరి వేసి కొలువు తీర్చారు. అమ్మవారిని దర్శించు కొనేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి వేయికళ్ల దుత్తల్లో దీపాలు వెలిగించి నెత్తిన పెట్టుకు వచ్చి నాలుగు కూడల్లో బద్దలు కొట్టారు. మడిచీరలపై నడుస్తూ కొందరు.. నవ ధాన్య మొలకలను అమ్మవారికి సమర్పించుకొని ఇంకొందరు మొక్కులు చెల్లించుకున్నారు. నగరి ఆభరణాలైన బంగారు శూలం, సరుడును రాజా అనుచరుల ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకరించి తీసుకెళ్లారు. దీంతో వెట్టివారు కుండలో వెలిగించిన గండర దీపాన్ని అమ్మవారికి చూపించి దీపం ఆరకుండా ఊరి పొలిమేరల్లోకి తీసుకుపోయి ఉంచారు. అక్కడ అమ్మవారి బలి దున్నపోతును తెగనరికి ఆ రక్తంతో పొలికుండల్లోని అన్నంతో కలిపి ఊరి పొలిమేరల్లో పొలి..పొలి అని అరుస్తూ చల్లారు. దున్నపోతు రక్తంతో తడిచిన కత్తిని అమ్మవారికి చూపాక.. పూలతో అలంకరించిన ట్రక్కులో అమ్మవారి ప్రతిమను ఉంచి విరూపమహోత్సవం నిర్వహించారు. శివాలయం వద్దకు చేరు కోగా అమ్మవారికి అలంకరించిన ఆభరణాలను తీసేశారు. అనం తరం కైవల్యానది మీదుగా మల్లయ్య తోట వద్ద ఏర్పాటు చేసిన విరూప మండపంలో అమ్మవారి ప్రతిమను విరూపం గావిం చారు. అప్పటి వరకు గండర దీపం ఆరిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అమ్మవారి మట్టిని ఇంట ఉంచుకుంటే అష్టైశ్వ ర్యాలు కలుగుతాయని, తింటే రోగాలు దూరమవుతాయన్నది స్థానికుల నమ్మకం. దీంతో అమ్మవారి మట్టిని దక్కించు కునేం దుకు భక్తులు పోటీపడటంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొ న్నాయి. అమ్మవారికి రాజాలు సమర్పించిన ఆభరణాలతోపాటు, స్వర్ణ కిరీటం అలంకరించారు. ఈ ఏడాది జాతర ఏర్పాట్లపై ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టి సారించారు.

తప్పెవరిది?

ఘటోత్సవంలో పోలికుండలు, బలిదున్న పోతును వాహనంపై ఊరేగించడం.. రాజాల వంటశాలకు బలి దున్న పోతును తీసుకెళ్లకుండా పోలీసులు అడ్డుకోవ డంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం రాత్రి జాతర ఊరేగింపులో, గురువారం అమ్మవారి విరూపోత్సవంలో సంప్రదాయం ప్రకారం రాజాల నగిరి నుంచి పంపే సప్పరం వినియోగించాలి. ఈ ఆచారానికి గత పాలకులు చరమ గీతం పాడి.. రథానికి బదులు ట్రాక్టరును వినియోగించారు. దీనిని అప్పట్లో తప్పు పట్టిన ఎమ్మెల్యే కురుగొండ్ల అదే ఆనవాయితీని కొనసాగించడం ఏమిటని స్థానికులు ప్రశ్నించారు. సప్పరంపై అమ్మవారిని ఊరేగిస్తే రోడ్డుకు రెండువైపులా ఉన్న భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కలిగే అవకాశం ఉండేదని స్థానికులు అంటున్నారు. ఇలా.. జాతర ఆచార వ్యవహారాల్లో తప్పిదం పాలకులదా? పాలకవర్గానిదా? లేదా అధికారులదా? అన్న చర్చ సాగుతోంది.



అమ్మవారి మట్టి కోసం తోపులాట

పోలీసుల వైఫల్యం

జాతర నిర్వహణలో పోలీసుల వైఫల్యం కనిపించింది. భారీ బందోబస్తు ఏర్పాటుచేసినా వారిని సమన్వయ పరుచుకోవడంలో ఉన్నతాధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి. ఈ ఏడాది కూడా పోలీస్, అధికారుల బంధువులకు వీవీఐపీ దర్శనాలు పెచ్చు మీరడం వల్ల సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓ దశలో ఎమ్మెల్యే కురుగొండ్ల జోక్యం చేసుకొని వీఐపీ దర్శనాలను కొంతసేపు నిలిపి వేయించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు లేక మండటెండలో గంటల తరబడి వాహనాలు ఆగిపోవ డంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడ్డారు. పోలీస్, అధికారుల సిఫారసు ఉన్న వారి వాహనాలను మాత్రం రాజమార్గంలో గుడి దగ్గర వరకు వెళ్లనివ్వడంతో కొన్నిచోట్ల ప్రజలు పోలీసులతో వాగ్వా దానికి దిగారు.

జాతర ఏర్పాట్లు ఫెయిల్: మంత్రి ఆనం

పోలీసుల నిర్లక్ష్యంతో పోలేరమ్మ జాతర ఫెయిల్ అయిందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. పోలేరమ్మకు రాష్ట్ర ప్రభుత్వం తరపున గురువారం ఆయన పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉన్న తాను పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలని పోరాడామన్నారు. గతేడాది ప్రభుత్వం గుర్తింపునిచ్చినా నిధులను విడుదల చేయలేదని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అమ్మవారి జాతరకు రాష్ట్ర పండుగగా గుర్తింపునిస్తూ రూ.50 లక్షలు అందించిందన్నారు. ఈ జీవోను కలెక్టర్ వెంకటేశ్వర్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు అందించారు. అనంతరం కురుగొండ్ల రామకృష్ణ వీరిని సన్మానించగా వేదపండితులు ఆశీర్వచనం పొందారు.





పోలేరమ్మకు రాజాల సారె తీసుకుని వస్తున్న రాజా కుటుంబీకులు సర్వజ్ఞయాచేంద్ర



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రులు కందుల సురేష్, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



పోలేరమ్మకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల దంపతులు



అమ్మవారి దర్శనానికి వెళుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



కర్ణాటక హైకోర్టు జడ్జి సుమలతకు వేద పండితుల ఆశీర్వచనం



అమ్మవారికి సారె తెస్తున్న ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి

పుత్తూరు వార్తలు

వడమాలపేట రుణం తీర్చుకుంటా : ఎమ్మెల్యే భాను



పిల్లలకు అన్నప్రాసన చేస్తున్న ఎమ్మెల్యే భాను ప్రకాష్

వడమాలపేట, సెప్టెంబరు 26: వడమాలపేట మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చెప్పారు. మండలంలోని ఓటీఆర్ కండ్రిగలో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం 'కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రగతిని సూచిస్తూ ఇంటి గోడలపై స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడికక్కడే దోచుకుని మండలాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే మండలంలో మౌలిక వసతులు కల్పన కోసం ఉపాధి హామీ నిధుల కింద 2.54 కోట్ల రూపాయలు మంజూరైందన్నారు. సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణాలను త్వరలో చేపట్ట నున్న ట్లు వివరించారు. తన విజయం కోసం కృషిచేసిన నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటానని చెప్పారు. దీర్ఘకాలికంగా సమస్యలుగా ఉన్న రోడ్లకు సంబంధించి ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించి నిధులు మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. కాగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అన్నప్రాసన చేశారు. వర్కర్లు తయారు చేసిన పౌష్టికాహారాన్ని పరిశీలించారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం



నారాయణవనం, సెప్టెంబరు 26: నారాయణ వనం మండలం సముదాయం గ్రామంలోని ఎంపీపీ పాఠశాల హెచ్ఎం మమత ఈ నెల 22న తిరుపతిలో జరిగిన ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకలో డీఈవో నుంచి ఉత్తమ టీచర్ అవార్డు అందుకున్నారు. ఈ క్రమంలో గురువారం ఆమెను సముదాయం గ్రామ సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, పాఠశాల చైర్మన్ వెంకటేష్, ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి అంగన్వాడీ కార్యకర్త హేమలత, అంగన్వాడీ సహాయకులు రేణుక పాల్గొన్నారు.

క్రమశిక్షణకు ప్రతిరూపం ఎన్‌సీసీ



పుత్తూరు టౌన్, సెప్టెంబరు 26: నిస్వార్థ సేవలకు, క్రమశిక్షణకు ప్రతిరూపం ఎన్‌సీసీ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య తెలిపారు. గురువారం కళాశాలలో ఎన్‌సీసీలో ప్రవేశం పొందిన 34 మంది విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు, 29 ఆంధ్ర బెటాలియన్ తిరుపతికి చెందిన సుబేదార్ బిమల్ మింజ్, సివిల్‌దార్ శివరాజ్, తెలుగు అధ్యాపకులు వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు తాళం తీయండి: సీపీఐ



పుత్తూరు టౌన్, సెప్టెంబరు 26: పుత్తూరు రైల్వేస్టేషన్‌లోని మరుగు దొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని సీపీఐ మండల కార్యదర్శి మహేష్ కోరారు. ఈ మేరకు గురువారం స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి గోపి, సీపీఐ నాయకులు రాజేష్ భాస్కర్, కాశి పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులివ్వండి



కమిషనర్‌ను సన్మానిస్తున్న టీఎన్‌టీయూసీ నాయకులు

పుత్తూరు టౌన్, సెప్టెం బరు 26: వీధి విక్రయ దారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని టీడీపీ చిత్తూరు జిల్లా పార్లమెంట్ టీఎన్ టీయూసీ అధ్యక్షులు రావిళ్ల మాధవనాయుడు కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ మంజు నాథగౌడకు వినతిపత్రం అందిం చారు. ఈ సందర్భంగా మాధవనాయుడు మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీటి వసతి కల్పించాలని, సులభ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలని, ఆటోస్టాండ్ల సదుపాయం కల్పించాలని కోరారు. అనంతరం కమిషనర్‌ను సన్మానిం చారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యుగంధర్, టీడీపీ నాయకులు కృష్ణంరాజ, మోహన్, కన్నన్, జయచంద్ర, పూల సుధ, మార్కెట్ రాజా పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఉచిత దంత వైద్య శిబిరం



పుత్తూరు, సెప్టెంబరు 26: పుత్తూరు మండలంలోని పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రిన్సి పాల్ కుమార్ మాట్లాడుతూ తిరుపతికి చెందిన శ్రీ సాయిడెంటల్ క్లినిక్ వారు ఈ శిబిరాన్ని నిర్వహించారని తెలిపారు. దాదాపు 400 మంది విద్యార్థులు, 50 మంది కళాశాల సిబ్బంది పరీక్షలు చేసుకున్నారని వివరించారు.

జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపిక



పుత్తూరు, సెప్టెంబరు 26 : పుత్తూరు ప్రభుత్వ ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాల మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన నగరి నియోజక వర్గ స్థాయి ప్రభుత్వ పాఠశాలల ఆటల పోటీలు గురువారం ముగిశాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌కు సంబంధించి అండర్ -14, అండర్-17 విభాగాలలో బాలురు, బాలికల జట్లకు దాదాపు 144 మంది ఎంపికయ్యారు. వీరంతా జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని నియోజక వర్గ కో-ఆర్డినేటర్ గుర్రప్ప తెలిపారు. ఈ ఎంపికలో ఐదు మండలాల కోఆర్డినేటర్లు నందకుమార్, మణి, జయదేవ్, సుబ్ర మణ్యం, కేశవులు, చంద్రశేఖర్‌రాజులు పాల్గొన్నారు.

రైల్వే ఎస్ఎస్ బాధ్యతల స్వీకరణ



పుత్తూరు, సెప్టెంబరు 26 : పుత్తూరు రైల్వే సూపరిం టెండెంట్‌గా శ్రీని వాసులు బాధ్యతలు స్వీకరిం చారు. తిరుత్తణి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన సందర్భంగా ఆయనను సిబ్బంది మరియదాసు, భగారీ, రాజశేఖర్, సురేష్ బాబులు సన్మానించారు.

సంక్షేమం.. అభివృద్ధి సమపాళ్లలో అందిస్తున్న మంచి ప్రభుత్వం



నాయుడుపేటలో మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల తదితరులు

నాయుడుపేట, సెప్టెంబరు 26: ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో అందిస్తున్న ఎన్డీయేదే మంచి ప్రభుత్వమని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట ఎంఆర్‌నగర్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ అధ్యక్షతన నిర్వ హించిన మంచి ప్రభుత్వ కార్యక్రమంలో టీడీపీ నాయకులతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్థానిక అల్లెమ్మగుడిలో 101 కొబ్బరికాయలను కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలింతలకు సీమంతా లను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్ర హ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజ యభాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కొండల్ రావు, కమిషనర్ ఫజులుల్లా, జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ నాయకులు పార్థసారథి, నెలవల రాజేష్, అరవపెరిమిడి చంద్రారెడ్డి, మైలారి రాజశేఖర్, దార్ల రాజేంద్ర, పసల గంగాప్రసాద్, కుబేరు మణి, నానాబాల సుబ్బారావు ఉన్నారు.

సూళ్లూరుపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు కరపత్రాలు అందజేసి, వివరించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా బాలింతలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీ కిషోర్, మాజీ ఎంపీపీ పి.సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు పి.మునస్వామి, రాజసులోచనమ్మ, రవి, రాము, పార్థసారథి, బీజేపీ నాయకులు ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ డిజైన్స్ ఎస్ఈగా శారద

● పలువురు ఈఈల బదిలీలు

తిరుపతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో డిజైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈగా ఓరింపాటి శారద నియమితులయ్యారు. ఇప్పటి వరకూ కడప జిల్లా ఇరిగేషన్ శాఖలో డిజైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈగా ఉన్న ఆమె గురువారం ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా తిరుపతికి బదిలీ అయ్యారు. శ్రీకాళహస్తి తెలుగు గంగ ప్రాజెక్టు గాలేరు-నగరి విభాగం ఒకటవ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సుబ్రమణ్యం మంజుల కడప జిల్లా ఎస్‌కేడీ జీఎన్ఎస్ఎస్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. నెల్లూరు జిల్లా సోమశిల ప్రాజెక్టు 2వ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా వ్యవహరిస్తున్న ఇరగా శ్రీనివాసరావు అక్కడ నుంచీ గూడూరు ఎస్ఎస్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. అనంతపురం తుంగభద్ర ప్రాజెక్టు కార్యాలయం నుంచీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రజావత్ సునీల్ నాయక్ తిరుపతి తెలుగు గంగ చీఫ్ ఇంజనీర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. విజయనగరం జిల్లా బొబ్బిలి నుంచీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరాజు రేణిగుంట జీఎన్ఎస్ఎస్ డివిజన్‌కు బదిలీ అయ్యారు.

ఇద్దరు ఆర్డీవోల బదిలీ

కలెక్టరేట్, సెప్టెంబర్ 26: జిల్లాలో ఇద్దరు ఆర్డీవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాళహస్తిలో పనిచేస్తున్న రవిశంకర్‌రెడ్డిని జీఏడీకి రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. అక్కడ డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న భానుప్రకాష్ రెడ్డిని శ్రీకాళహస్తి ఆర్డీవోగా నియమించింది. ఇక సూళ్లూరుపేట ఆర్డీవోగా పనిచేస్తున్న చంద్రమునిని జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. ఎన్టీఆర్ జిల్లా కోనేరు రంగారావు కమిటీలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఈతమాకుల కిరణ్మయిని సూళ్లూరుపేట ఆర్డీవోగా నియమించింది. జిల్లాలో అత్యంత కీలకమైన తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి ఇటీవల అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయ్యారు. ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. శుక్రవారం మరికొంత మంది డిప్యూటీ కలెక్టర్లు బదిలీ కానున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల (ఆర్డీవోలు) బదిలీల్లో కూటమి ప్రభుత్వం శిక్షణ పూర్తి చేసుకున్న డిప్యూటీ కలెక్టర్లకు ప్రాధాన్యత ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

మున్సిపల్ కమిషనర్‌గా ఫజులుల్లా బాధ్యతల స్వీకరణ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 26: నాయుడుపేట మున్సిపల్ కమిషనర్‌గా ఫజులుల్లా గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రటరీగా పనిచేస్తున్న ఫజులుల్లా బదిలీపై నాయుడుపేట మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు. ఆయనను మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మోహిద్దీన్, ఏఈ జాకీర్, సిబ్బంది లక్ష్మీ, శ్రావణి, రమేష్, చిరంజీవి, శ్రీనివాసులు, గాయత్రి తదితరులు స్వాగతించారు.

మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విజయ్

వాకాడు, సెప్టెంబరు 26: జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వాకాడు మండలానికి చెందిన దామా విజయ్‌కుమార్‌ను గురువారం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎంఎల్ రాజు నియమించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ జాతి ఐక్యత కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

4 కేజీల గంజాయి పట్టివేత

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 26: అక్రమంగా తరలిస్తున్న 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో బుధవారం రాత్రి అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వెంకటరావు అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో అదుపులోకి తీసుకొని విచారించగా, అతడి వద్ద 4 కేజీల గంజాయి దొరికిందని చెప్పారు. గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రేపు యువజనోత్సవాలు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 26: వివేకానంద జయంతి సందర్భంగా శనివారం యువజనోత్సవాలు నిర్వహించనున్నామని సెట్విన్ సీఈవో మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలాజీకాలనీలోని ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో ఉదయం 9.30గంటల నుంచి సాంస్కృతిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. మొదటి స్థాయిలో గెలుపొందిన కళాకారులకు రాష్ట్రస్థాయి, అక్కడ గెలుపొందితే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందని తెలిపారు. జానపద నృత్యాలు, గీతాలు, కవిత్వం, వ్యాసరచన, పెయింటింగ్ వంటి పోటీలు ఉంటాయని, మరిన్ని వివరాలకు 0877 - 2286921, 7036428762లలో సంప్రదించాలని కోరారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముక్కంటి సేవలో రష్యా దేశీయులు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం 43మంది రష్యా దేశస్తులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగ తం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించారు. వారు స్థానిక ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. శిల్పకళ చాలా అద్భుతంగా ఉందన్నారు. కాసేపు ధ్యానం చేశారు.

ఘనంగా ఫార్మసిస్టు డే వేడుకలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26: పట్టణంలోని కొత్తపేటలో గల శ్రీరామ మందిరంలో గురువారం ఘనంగా ఫార్మసిస్టు డే వేడుకలను శ్రీకాళహస్తి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పలువురు మెడికల్ ఫార్మసిస్టులను సన్మానించారు. కేక్ కట్ చేశారు. తిరుపతి జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి రాము, శ్రీకాళహస్తి అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన్‌రావు, కార్యదర్శి గోపాల్, కోశాధికారి కార్తీక్ రెడ్డి, అమరా జనార్ధన్, ఆనంద్‌గుప్తా, అసోసియేషన్ మెంబర్లు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



స్వర్ణముఖి నదిని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26: ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. పుల్లారెడ్డి కండ్రిగ గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నది వద్ద సీపీఐ నాయకులు పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయన్నారు. స్థానిక అధికారులు మిన్నకుండి పోతు న్నారని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, మించల శివకుమార్, గోపి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కాలనీలో చోరీ

రేణిగుంట, సెప్టెంబరు 26: స్థానిక భగత్‌సింగ్ కాలనీలోని ఓ ఇంట్లోచోరీ జరిగింది. గాజులమండ్యం పోలీసుల కథనం మేరకు.. భగత్‌సింగ్ కాలనీలో కాపురం ఉంటున్న లత, క్రిష్ణయ్య దంపతులు కుటుంబంతో సహా బంధువుల వివాహానికి బుధవారం వెళ్లారు. గురువారం ఉదయం వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువాలోని రూ.25వేలు నగదు, 250 గ్రాముల వెండి చోరీ జరిగిందని పోలీసులకు పిర్యాదుచేశారు. క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విమానాశ్రయం వద్ద పటిష్ట బందోబస్తు

రేణిగుంట, సెప్టెంబరు 26: తిరుపతి విమానాశ్రయం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని రేణిగుంట ఇన్‌చార్జి డీఎస్పీ నరసింహమూర్తి గురువారం తెలిపారు. జిల్లాలో 30 పోలీసుయాక్టు అమల్లో ఉన్నందున ఎక్కడా సభలు, మైకులు ఏర్పాటు చేయరాదని స్పష్టంచేశారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అల్లూరి చరిత్ర పరిశోధకుడు పడాలకు నివాళి



వరదయ్యపాళెం, సెప్టెం బరు 26: జాతీయ అల్లూరి సీతారామరాజు యువ జన సంఘం వ్యవ స్థాపక అధ్య క్షులు, 'కోస్తా సమయం' పత్రిక సంపాద కులు పడాల వీరభద్రరావు ఇటీవల మరణించారు. వరదయ్య పాళెంలో గురువారం కేబీ గురుదేవ్, గుత్తిత్యాగరాజు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వరదయ్య పాళెంలో అల్లూరి విగ్రహ ఏర్పాటు చేయాలన్న ఆయన కోరికను నెరవేర్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అమరలింగయ్య, నాగప్రసాద్, సిద్దులయ్య, ప్రతాప్, కన్నన్, మోహన్ నాయుడు, గణేష్ తదితరులున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26: శ్రీకాళహస్తిలో బీజేపీ నాయకులు ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ మేళాగారం సుబ్ర హ్మణ్యం రెడ్డి, కోలా గోవర్ధన్, గరికపాటి రమేష్‌బాబు, భరత్‌నాయుడు పాల్గొన్నారు.

డిక్లరేషన్ ఇవ్వాలి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26:ఈ నెల 28న తిరుమలకు రానున్న మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి టీటీడీ అధికారులకు డిక్లరేషన్ ఇచ్చిన తర్వాతే స్వామివారి దర్శ నానికి వెళ్లాలని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు చేశారు. కలశ ప్రతిష్ఠ చేసి వినాయక పూజలు నిర్వహించారు. అభిషేకం జరిపించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేకంగా అలంకరించి మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

29న ఉచిత వైద్యశిబిరం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26: తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెంలో ఈ నెల 29వ తేదీ ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ చెంచుకృష్ణమనాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తికి చెందిన భరత్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు జూలుగంటి భరత్, దీపిక ఆధ్వర్యంలో తంగేళ్లపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మజ్దూర్ యూనియన్ ఆర్థికసాయం



రేణిగుంట, సెప్టెంబరు 26: రైల్వే విద్యుత్‌శాఖలో విధులు నిర్వహిస్తున్న భరత్ ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెంద డంతో గురువారం మృతుని తల్లి పార్వతమ్మకు రూ.2లక్షలు చెక్కును గుంతకట్లు డివిజన్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రాజు, బ్రాంచ్ కార్యదర్శి సురేష్, ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శి గోపాల్‌సింగ్ అంద జేశారు. మజ్దూర్ యూనియన్‌లో రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకోవడం వల్ల ఈ ఆర్థికసాయాన్ని అందజేస్తున్నామని మజ్దూర్ యూనియన్ నాయకులు తెలిపారు.

రేణిగుంట తుడా పార్కుకు మోక్షం



రేణిగుంట, సెప్టెంబరు 26: రేణిగుంటలోని తుడా పార్కుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. వైసీపీ హయాంలో ఐదేళ్ల పార్కు నిర్వహణను గాలికి వదిలేయడంతో పార్కులో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. యాచకులకు నివాసంగా మారింది. గురువారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు.

ఘనంగా పోషకాహార మాసోత్సవాలు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 26: మండలంలోని కారిపాకం గ్రామంలో వైద్యశాఖ తరపున పోషకాహార మాసోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, ఏఎన్ ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు చట్టంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26: ఖైదీలకు చట్టంపై అవగాహన ఉండాలని స్థానిక 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌జైలును గురువారం ఆయన సందర్శించారు. పరిసరాలు, భోజన వసతి తదితరాలను పరిశీలించారు. అనంతరం బెయిల్, ఉచితన్యాయం తదితర చట్టాలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

దోపిడీ వారిది-ప్రగతి మనది

● సత్యవేడు టీడీపీ కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు ● పిచ్చాటూరులో 'ఇది మంచి ప్రభుత్వం' సంబరాలు





పిచ్చాటూరులో, కీళపూడిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పిచ్చాటూరు, సెప్టెంబరు 26: దోపిడీయే ప్రధాన అజెండాగా వైసీపీ పాలన కొనసాగితే, ప్రగతే ధ్యేయంగా టీడీపీ కూటమి పాలన సాగు తోందని టీడీపీ సత్యవేడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు పేర్కొన్నారు. గురువారం పిచ్చాటూరు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు పెంచడంతో పాటు డీఎస్సీ ప్రకటించామన్నారు. దీపావళికి సిలిండర్లు, తల్లికి వందనం, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేయ నున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధారాణి, పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సుమాంజలి, బీజేపీ మండల అధ్యక్షుడు ఆనందనాయుడు, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి ఎం.ఎస్.రవి, నాయకులు బుజ్జినాయుడు, సురేష్‌నాయుడు, శ్రీనివాసులు, రాజేశ్వరి, రాజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

● కీళపూడిలో...

మండలంలోని కీళపూడిలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్య క్షుడు పద్మనాభరాజు ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామకృష్ణమరాజు, నాయ కులు, మహిళలు పాల్గొన్నారు.

టీడీపీ అంటేనే పేదల ప్రభుత్వం



మాట్లాడుతున్న రామాంజులనాయుడు

కేవీబీపురరం, సెప్టెం బరు 26: టీడీపీది పేదల ప్రభుత్వమని ఆ పార్టీ మండలాధ్యక్షుడు రామాంజులనాయుడు అన్నారు. గురువారం మండలంలోని అంజూరు గ్రామంలో ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు సచివాలయంలో నమోదు చేసుకోవాలని చెప్పా రు. ఉపాధి జాబ్‌కార్డులు లేనివారు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదిస్తే అందజేస్తారని తెలిపారు. ఈ కార్య క్రమంలో పార్లమెంటరీ రైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, రాజారెడ్డి, సురేష్‌రెడ్డి, ముకేష్, బీజేపీ నాయకులు వెంకటయ్య, జనసేన అధ్యక్షులు థామస్, ఎస్సీసెల్ అధ్యక్షులు సాధు, మండల మహిళాధ్యక్షురాలు పావని, రాజులకండ్రిగ సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో రామచంద్ర, ఈవోపీఆర్డీ దయాసాగర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వికృతమాలలో అక్రమ కట్టడాల తొలగింపు



ఏర్పేడు, సెప్టెంబరు 26: ఏర్పేడు మండలం వికృతమాలలో అక్రమ కట్ట డాలను తహసీల్దార్ భార్గవి ఆధ్వ ర్యంలో రెవెన్యూ సిబ్బంది తొలగిం చారు. సర్వే నెంబరు 51లో ఉన్న ప్రభుత్వ స్థలంలో మండలస్థాయి వైసీపీ నేతలు కొందరు పదుల సంఖ్య లో అక్రమ కట్టడాలను నిర్మించారు. వీటిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరుస కథనాలు రావడంతో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. గురువారం పూర్తిస్థాయిలో అక్రమ కట్టడాలను తొలగించారు. సుమారు 14 గదులను తొలగించారు. సర్వే నెంబరు 51లోనే మిగిలిన రెండు నిర్మాణాలపై కోర్టులో కేసు నడుస్తున్నందు వల్ల తొలగించలేదు.

అన్నదాతకు పెట్టుబడి సాయం అందించండి




కేవీబీపురంలో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కేవీబీపురం, సెప్టెంబరు 26: అన్నదాతకు ప్రభుత్వం పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ గురువారం డిమాండ్ చేశారు. రైతులకు ఉచిత బీమా పథకాన్ని అమలు చేయాలని రూ.2లక్షల లోపు రైతు రుణాలను రద్దు చేయాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, తెలుగుగంగ నీటిని అందజేయాలని కోరారు. అనంతరం డీటీ మునిరత్నానికి వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఏర్పేడు: రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రూ.20వేలు తక్షణమే అందిం చాలని ఏపీ రైతు సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి హేమలత కోరారు. ఈ మేరకు ఆమె మండలంలోని రైతు సంఘం నాయకులతో కలిసి తహసీల్దారు భార్గవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాతూ చెరకు పంట తీసుకున్న ప్రైవేటు ఫ్యాక్టరీలు రైతులకు డబ్బులు చెల్లించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగయ్య, ధర్మారెడ్డి, రాజేంద్ర, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు



వరదయ్యపాళెం: మండలంలోని 43 రేషన్ దుకాణాల్లో తూనికలు, కొలతలశాఖ అధి కారులు గురువారం తనిఖీలు చేశారు. తూ కంలో అవక తవకలు జరగకుండా ఉండేం దుకు తనిఖీలు నిర్వహించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లీశ్వర్ తెలిపారు. అధికారులు గణేష్, యోగేష్, పెద్దబాబు పాల్గొన్నారు.

కళాశాలలో శుభ్రత..పరిశుభ్రత

పిచ్చాటూరు, సెప్టెంబరు 26: పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం కళాశాల ఆవరణలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహిం చారు. చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రిన్సిపాల్ డిల్లీబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26: శ్రీకాళహస్తి స్వర్ణముఖి సమీపంలోని దర్గాలో గురువారం ఘనంగా ఉరుసు ఉత్సవం జరిగింది. ఈ కార్య క్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి హాజరయ్యారు. ఆమెకు దర్గా నిర్వాహకులు స్వాగతం పలికారు. దర్గాలో ఆమె ప్రత్యేకప్రార్థనలు చేశారు.

కుంభాభిషేకానికి ఆహ్వానం

వరదయ్యపాళెం, సెప్టెంబరు 26: వరదయ్యపాళెం మండలంలోని కువ్వాకొల్లి పంచాయతీలోని లక్ష్మీపురం ఆలయ కుంభాభిషేక మహోత్స వానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్‌ను గురువారం ఆ పార్టీ మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో తదితరులు

వరదయ్యపాళం, సెప్టెంబరు 26: స్వర్ణాంధ్ర-2047కు సంబంధించి ప్రతి పంచాయతీలో గ్రామసభలు నిర్వ హించి అభివృద్ధి కోసం ప్రణాళి కలు సిద్ధం చేయాలని సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. గురువారం సత్యవేడు ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందు వాల్‌పోస్టర్లు ఆవిష్క రించారు. పంచాయతీ కార్యదర్శి మునిరవికుమార్, హరీష్, రజిత, మాధవి, కుముద పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కేవీబీపురం, సెప్టెంబరు 26: అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సమ స్యలపై గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు రాజేశ్వరి, మునీ శ్వరి, జ్ఞానమ్మ, భార్గవి, అంగన్వాడీ వర్కర్లు, గ్రీన్ అంబాసిడర్లు, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు వాణిజ్య పంటలు సాగుచేయాలి



ఐఐటీ అధికారులు, గ్రామస్తులు

ఏర్పేడు, సెప్టెంబరు 26: రైతులు వాణిజ్య పంటలు సాగుచేయాలని ఐఐటీ అధికారులు పేర్కొన్నారు. గురువారం తిరుపతి ఐఐటీ అధికారులు చిందేపల్లి గ్రామంలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసే పంటలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఐఐటీకి చెందిన హార్టికల్చర్ అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు మినుములు, సజ్జలు, జొన్న తదితర వాణిజ్య పంటలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీకి చెందిన నోడల్ అధికారి ఆర్ఎస్ చైతన్య, జీవీ సుబ్బారెడ్డి, ఎం.వెంకటరమణ, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వికృతమాల సర్పంచ్‌పై డీఎల్‌పీవో విచారణ

ఏర్పేడు, సెప్టెంబరు 26: వికృతమాల సర్పంచ్ అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. మండలంలో ఉన్న అతిపెద్ద పంచాయతీల్లో వికృతమాల ఒకటి. అయితే ఈ పంచాయతీకి గత ప్రభుత్వంలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ మద్దతు అభ్యర్థిపై స్వల్ప తేడాతో వైసీపీ మద్దతు అభ్యర్థి రుక్మిణి సర్పంచ్‌గా గెలుపొందారు. గత మూడేళ్ల పదవీకాలంలో సర్పంచ్ భారీ అవినీతికి పాల్పడ్డారని అదే గ్రామానికి చెందిన జడ్పీటీసీ కావేరి తిరుమలయ్య జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు గురువారం డీఎల్‌పీవో ప్రభు రెడ్డి సర్పంచ్‌పై విచారణ చేపట్టారు. గత మూడేళ్లలో వికృతమాల పంచాయతీలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులను సచివాలయానికి పిలిపించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ విచారణ మూడు రోజుల పాటు సాగుతుందని మూడోరోజు వివరాలను వెల్లడిస్తామని డీఎల్‌పీవో తెలిపారు.

పేదలకు జనసేన అన్నదానం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 26: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం డొక్క సీతమ్మ స్ఫూర్తితో జనసేన నాయకులు పేదలకు అన్నదానం చేశారు. సుమారు 300మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డొక్క సీతమ్మ స్ఫూర్తితో ప్రతివారం పేదలకు అన్నదానం చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పేట చంద్రశేఖర్, చిరంజీవి, రమణయాదవ్, దినేష్, మణి, శ్రీనివాసులు, మునిచంద్ర, వీర మహిళలు, పేట రాధ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.